కథ

# ఆడది

## నెల్లుట్ల ఇంద్రుడు

**మేం మొత్తం పది పదిహేనుమందిమి. మంచి స్నేహితులం. కవులూ, జర్నలిస్టులు, నూతన సామాజికోద్యమకారుల కూటమి మాది. తరచూ కలుస్తుంటాం. కష్టసుఖాలు, కవిత్వం, కథలు, గాసిప్స్ ఇలా ఎన్నో విషయాల గురించి కలబోసుకుంటూ తిని తాగి సెలబ్రేట్ చేసుకుంటాం.**

**అటువంటి ఓ సెలబ్రేషన్ సందర్భం.**

**అంతా మామూలుగానే నడుస్తోంది.**

**మా కబుర్లు సామాజిక రాజకీయాల దగ్గర మొదలై ఆడ స్నేహితుల వైపు దారితీశాయి.**

ఉన్నట్టుండి వాతావరణాన్ని గంభీరంగా మార్చేసాడు చంద్ర. అంటే చంద్ర ఏదో ఒక సీరియస్ విషయం గురించి చెప్పబోతున్నాడని అర్థం. చంద్ర స్వతంత్ర భావాలు కల మనిషి. అనుకున్నది చేసి తీరాలనుకునే తత్వం. స్నేహానికి ప్రాణం ఇస్తాడు. స్నేహితురాళ్ళు ఎక్కువ. పెళ్లి లాంటి తతంగాలు ఏమీ లేకుండా తనకు నచ్చిన స్వప్నతో పదేళ్ళుగా ఒకే ఇంట్లో ఉంటున్నాడు. వాళ్ళమధ్య గొడవలేమీ లేవు.

చంద్ర ఏదోచెప్పడం మొదలు పెట్టాడు.... "మొన్నామధ్య ఓ రోజు సాయంత్రం స్వప్న స్నేహితులు, స్నేహితురాళ్ల కొందరు భోజనానికి వచ్చారు. దాదాపుగా అందరం తలాకొంత డ్రింక్ తీసుకున్నాం".

"కథకి ఓపెనింగ్ బ్యాంగ్ లేదోయ్, చప్పగా ఉంది" అన్నాడు రమణ. ఎటువంటి సందర్భంలోనైనా ఏదో ఒక జోక్ కట్ చేయడం రమణ అలవాటు. మేమంతా నవ్వుతుండగానే చంద్ర కొనసాగించాడు.



టైం పదయింది. ఓ ఇద్దరు టి.వి.లో డే అండ్ నైట్ క్రికెట్ మ్యాచ్ లో మునిగిపోతే మరో ఇద్దరు టెర్రెస్ మీదకు వెళ్ళి కబుర్లలో సెటిల్ అయిపోయారు. హాల్లో నేను స్వప్న స్నేహితురాలు ఒకరితో మిగిలిపోయాను. మా ఇద్దరి మధ్య కొంత సంభాషణ అరకొరగా నడుస్తోంది. "మొట్టమొదటిసారి నువ్వు నాతో నీలిమేఘాలు పుస్తకావిష్కరణ సభలో మాట్లాడావు. అపుడు నీ కళ్ళలో కనపడ్డ ఒక మెరుపు నా మీద నీకు కోరిక ఉందని చెప్పింది" అంది ఉన్నట్టుండి స్వప్న స్నేహితురాలు. నేను ఊహించని సంభాషణ ఇది. నాకు ఆ సభలో ఆమెతో మాట్లాడ్డం కానీ ఆనాటి నా కళ్ళల్లో మెరుపుకానీ ఏ మాత్రం గుర్తు లేవు. ఏం మాట్లాడాలో అర్థంకాక జీవంలేని నవ్వొకటి వదిలి ఊరు కుండిపోయాను.

"నిజం చెప్పాలంటే ఏదో ఒక రోజు ఈ కుర్రాడ్ని నేను ముద్దు పెట్టుకోబోతున్నాను అని ఆ రోజే అనుకున్నాను తెలుసా" రెండో దాడి చేసింది స్వప్న స్నేహితురాలు.

చూడ్డానికి నిలువెత్తు సంప్రదాయంలా కనపడే మహిళ ఆమె. పండుగలకూ పబ్బాలకూ పట్టుచీరలు కట్టుకోపడం వంటివి కూడా చేస్తుండేది. అయితే భావాలు మాత్రం ఆధునికంగానే ఉండేవి. ఇప్పుడు ఈ సంభాషణ మాత్రం నాకు విచిత్రంగానూ, ఇబ్బందిగానూ కూడా ఉంది.

"నా కళ్ళల్లో మెరుపు మీ భ్రమ, నన్ను ముద్దు పెట్టుకోవాలనుకోవడం మీ దురాశ అంటూ అక్కడి నుంచి వంటింట్లో ఉన్న స్వప్న దగ్గరకు వెళ్ళిపోయాను. ఆ తరువాత ఆవిడ చాలాసార్లు నాకు ఎదురయింది. ఎపుడూ చనువుగా మాట్లాడలేదు. ముభావంగానే పరిచయం కొనసాగించాను" అని ముగించాడు చంద్ర.

"కథలో క్లోజింగ్ ట్విస్ట్ కూడా బాగాలేదోయ్" అన్నాడు రమణ తన సహజ ధోరణిలో.

"తరచూ కాకపోవచ్చు కానీ మనలో చాలామందికి అపుడప్పుడైనా సరే ఎదురయ్యే అనుభవం ఇది. ఇక్కడ ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అనే మీమాంస అనవసరం" అంటూ కథకో నీతి వాక్యాన్నిచ్చాడు ఎపుడూ సీరియస్‌గా మాత్రమే ఆలోచించే నర్సయ్య.

"నా బాధంతా తప్పు ఒప్పుల గురించి కాదు. నిజానికి నేను ఆ విషయం మరిచిపోయి చాలా రోజులైంది. ఈ మధ్యే కొత్త విషయం తెలిసింది. ఆవిడ నా గురించి గమ్మత్తయిన ప్రచారం చేస్తోంది. నాకు ఆడ స్నేహితులు ఎక్కువ కనుక నేను ఫ్రీగా ఉంటాననుకుందట. అయితే నాలాంటి వాళ్ళకు అందంపట్ల, ఎర్రతోలుపట్ల చాలా మోజట. ఏమాత్రం అందంగా లేని అమ్మాయినైనా నేను స్నేహితురాలిగా స్వీకరించనట" బాధగా అన్నాడు చంద్ర.

"అయితే ఆవిడ బాబూమోహన్ కజిన్ సిస్టరా" మళ్లీ జోకేశాడు రమణ.

"అదేంకాదు మిత్రురాళ్ళతో స్నేహంగా

ఉంటున్నామంటే ఏదో సంబంధం ఉన్నట్టే అని అర్థం కాదుకదా" అని కొంచెం కోపంగానే మాట్లాడాడు చంద్ర.

"కోపానికి, బాధకు ఒకే మందు గురూ" అంటూ మరో పెగ్గు అందించాడు రమణ. కొద్దిసేపు చర్చ సరదా విషయాల వైపు మళ్ళింది. ఇక్కడ రమణ గురించి కొంచెం చెప్పాలి. పైకి అల్లరిగా ఎపుడూ జోకు లేస్తూ తన కష్టనష్టాల గురించి ఎవరికీ చెప్పుకోని రమణలో ఒక సీరి యస్ విశ్లేషకుడూ ఉన్నాడు. అనేక విషయాలు మాట్లాడేటపుడు అతనికి ఉండే స్పష్టత మా అందరిలో కొంచెం తక్కువే. ఆ గుణం వల్లనే అతని అల్లరిని మేమంతా భరిస్తుంటాం.

ఉన్నట్టుండి "నేనో సీరియస్ విషయం చెప్పబోతున్నాను" అన్నాడు రమణ. మేమందరం చెవులు రిక్కించేసాం.

"శాంతిని నేను ముఖాముఖి కలుసుకుని మాట్లాడింది చాలా తక్కువసార్లే. మా పరిచయం వయసు కేవలం నాలుగేళ్ళే. బహుశా ఈ నాలుగేళ్ళలో మేం కలిసింది నాలుగుసార్లే కావచ్చు. నాలుగేళ్ళ క్రితం విజయవాడలో మొదటిసారి శాంతిని ఓ సాహిత్య సభలో కలిసాను అపుడు తను ఏదో ఎన్జీవోకు పనిచేసేది. మొదటి పరిచయం లోనే మాకు ఓ ప్రాజెక్టు రిపోర్టు తయారుచేసి పెట్టకూడదూ అని అడిగింది. నాకు అంత ఓపికలేదులే అని సమాధానం చెప్పి తప్పించుకున్నాను. ఇంకోసారి కూడా విజయవాడ లోనే కలుసుకున్నాను. ప్రాజెక్టు రిపోర్టు విషయం మళ్ళీ ప్రస్తావించింది. నాకు వీలుపడదని చెప్పానుగా అన్నాను. మూడోసారి కలుసుకున్నది హైదరాబాద్‌లో మా ఇంట్లో. విజయవాడ నుంచి హైదరాబాదుకు ఏదో పనిమీద వచ్చానంది. పిచ్చాపాటి మాట్లాడి వెళ్ళిపోయింది. తరువాత తను విజయవాడ నుంచి వచ్చేసి హైదరాబాదులో సెటిల్ అయిన ఆర్నెల్ల తరవాత కానీ ఇక్కడే ఉంటుందని తెలియలేదు. చాన్నాళ్ళు మేం కలుసుకోలేదు. కనీసం ఫోనులో కూడా మాట్లాడుకోలేదు ".

Concept is one.
interpretations are
many.
**ఇది కథ కాదు... ఆగస్టు 28, ఆదివారం వార్త సంచికలో కథ అంటూ 'మగాడు' పేరుతో అచ్చయిన రాతలకు ఇది జెండర్ మార్పిడి తిరగరాత మాత్రమే - రచయిత**

ఈలోగా మరో రౌండు మందు మా ముందుకు వచ్చింది.

మందు సిప్ చేస్తూ కొనసాగించాడు రమణ. "ఓ అర్ధరాత్రి ఉన్నట్టుండి ఫోన్ చేసింది.నా పర్సనల్ విషయాల గురించి మాట్లాడింది.ఏదో సలహాలివ్వబోయింది. కొన్ని విమర్శలూ చేసింది. నా విషయాల్లో నీ జోక్యం అనవసరం అని సుతి మెత్తగానే చెపుతూ ఫోన్ పెట్టేశాను".

"కానీ ఆ తరువాత అనిపించింది. శాంతి చెప్పిన విషయాల్లో వాస్తవం ఉందని... నాల్గవసారి కలిసినపుడు మాత్రం ఒక రాత్రంతా మా ఇంట్లోనే ఉంది. నిజానికి శాంతి గురించి నాకు తెలిసింది ఆ రాత్రే. నేను పైకి ఎంత సరదాగా ఉన్నా నా సమస్యలు నాకు ఉన్నాయి. ఒంటరి రాత్రులెన్నింటినో భారంగా మోసాను. మందుకొట్టో, పుస్తకాల్లో మునిగిపోయో, అనవసరపు వ్యాపకాలు కల్పించుకొనో కాలాన్ని చెరిపేసేవాడ్ని. ఆ రాత్రి అలాంటిదే మరో ఒంటరి రాత్రి. ఎందుకో శాంతికి ఫోన్ చేయాలనిపించింది. చాలాసేపు మాట్లాడుకున్నాం. నా కబుర్లలో నా మనసులో ఉన్న ఏకాంతం బయటపడ్డట్టుంది. రమ్మంటావా అని అడిగింది శాంతి. వచ్చేయ్ అన్నాను. తనకో కారుంది. అర్ధరాత్రి అపరాత్రి అయినా వచ్చేయగలదని నాకు తెలుసు. ఓ గంట తరువాత నేను చెప్పిన అడ్రస్‌ను పట్టుకుని కచ్చితంగా వచ్చేసింది. ఆలస్యమైందేం అని అడిగా. మందు దుకాణం దొరికించుకోవడం కష్టం అయింది. అసలే అర్ధరాత్రి.. పైగా ఆడపిల్ల వచ్చి సూటిగా బ్రాండ్ పేరు చెప్పి అడి గేయడం నాయాళ్లకు నచ్చలేదనుకుంటా ఒకట్రెండు దుకాణాలలో ఇవ్వం పో అనేసారు. అలా వోడ్కా వేట లేటు చేసింది అంది నవ్వుతూ. నాలుగేళ్ళ క్రితం నేను నాకు వోడ్కా ఇష్టమని చెప్పిన మాట గుర్తుపెట్టుకున్నానని చెప్పింది.అలా గుర్తుపెట్టుకోవడం నాకు నచ్చింది. చెరికొంచెం తాగాం. చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాం. నిజానికి తనే ఎక్కువ కబుర్లు చెప్పింది. నేను కేవలం శ్రోతగా ఉండిపోయానంతే. తనకు హిందీ సరిగా రాదు. పాత హిందీ పాటల క్యాసెట్లు పెట్టించు కుని నాతో అర్థాలు చెప్పించుకుంది. అర్థం తెలియకుండానే తనకొచ్చిన హిందీ పాటలు పాడింది".

"ఉన్నట్టుండి శాంతి అడిగింది. రమణా నాతో పడుకో అని" నేనేమి షాకవ్వలేదు. అలా అడగడం కానీ, పడుకోవడం కానీ తప్పని కూడా నాకనిపించలేదు. ఒక ఆడా, మగా ఒంటరిగా రాత్రి వేళ గడిపినంత మాత్రాన లేదూ వారిద్దరి స్నేహం అతి దగ్గరితనంగా మారినంత మాత్రాన పడుకోవడం అవసరమా, అలా ఏదైనా రూలుందా అని ఆలోచిస్తూనే ఊరికే ఏమంటుందో చూద్దామని "నన్ను పెళ్ళి చేసుకుంటావా" అని అడిగాను.

"నీకు పిచ్చా ఏమిటి సింగిల్‌గా ఉండడంలోనే బోలెడంత ఆనందం ఉంది. దానికి నువ్వు, నేను నిదర్శనం" అంది.

"నాకెందుకో ఇదంతా నచ్చడంలేదు. ఆర్థిక స్వేచ్ఛ ఉండి సమాజాన్ని పట్టించుకోకుండా ఉండగలిగే ధైర్యం ఉంటే బోలెడంత ఆనందం నిజంగానే ఉంటుంది. ఆ ఆనందం అందరికీ అందుబాటులోకి రాదేమో అని మనసులో అనుకుంటూ పైకి మాత్రం నీతో పడుకోవాలని నాకు అనిపించడంలేదు" అని అన్నాను. అలా అని నువ్వంటే ఇష్టంలేక కాదు అని అనబోతూ తలెత్తి చూసేసరికి శాంతి నా ముందు లేదు. అప్పటికే నాకు మందు ఎక్కువైనట్టుంది. తనెలాగూ కారెక్కి వెళ్ళిపోగలదని తెలుసు. పైగా ఇపుడు తనకు గ్రౌండ్‌ఫ్లోర్ వరకూ వెళ్ళి సెండాఫ్ ఇచ్చే ఓపిక ఎలాగూలేదు. పోతేపోనీ అనుకుంటూ నిద్రపోయా".

"కథలో ఓపెనింగ్ బ్యాంగ్, ఇంటర్వెల్ బ్యాంగ్ లేకపోతేలేకపాయె కనీసం క్లైమాక్స్ బ్యాంగ్ కూడా లేదోయ్" అన్నాడు నర్సయ్య ఇంత క్రితం రమణ కట్ చేసిన జోక్‌కు రిటార్ట్‌గా.

అదేమీ వినిపించుకోనట్టు మళ్ళీ మొదలుపెట్టాడు రమణ. "తెల్లారింది....లేచి హాల్లోకి వెళితే అక్కడ సోఫా మీద చిన్న పిల్లలా ముడుచుకుని పడుకుని ఉంది శాంతి. మొహంలో బోలెడంత అమాయకత్వం కనపడుతోంది. శాంతి పెద్ద అందగత్తేమీ కాదు. ఆ క్షణాన మాత్రం చాలా అందంగా కనిపించింది. బోలెడంత ముద్దొచ్చింది. శాంతిని లేపాను. "ఒక్కసారి నన్ను కావులించుకో" అన్నాను. చెప్పినట్టు చేసింది. ఆ కావిలింతలో మోహం లేదు, కోరికలేదు, ఉద్రేకం లేదు, సెక్స్ లేదు అంతా ప్రశాంతత..... శాంతి ఇంటికి వెళ్ళిపోయింది".

ఏ శారీరక అనుభవంలేని ఆ రాత్రి, శాంతి మీద ప్రేమేకాకుండా బోలెడంత గౌరవం కూడా కలిగేట్టు చేసింది. ఎందుకంటే ఒంటరితనం, మందు మత్తులో ఉన్న నన్ను శాంతి తలచుకుంటే ఆ రాత్రి లొంగదీసుకుని ఉండొచ్చు. తను కావాలనుకుంటే కాదనగలిగేంత మానసిక, శారీరక బలం నాలో లేవేమో కూడా. అసలు మేమిద్దరం ఉన్న పరిస్థితికి తనకు నన్ను లొంగదీసుకోవడానికి చాలా అవకాశాలున్నాయి. నాకు శాంతి నిజాయితీ నచ్చింది. పురుషుడి మనస్థితిని అర్థం చేసుకుని దానికి అనుగుణంగా స్వచ్ఛంగా మెలిగే ఆడవాళ్ళు ఎందరుంటారు చెప్పండి. వోడ్కా తీసుకురావడంలో నామీద ఎంత ప్రేమ చూపెట్టగలిగిందో నేను కాదనగానే వెళ్ళిపోయి దూరంగా పడుకునీ అంతకంటే ఎక్కువ గౌరవాన్నే చూపెట్టగలిగింది. ఆ తరువాత మేమెపుడూ కలుసు కోలేదు. నాకు తెలిసిన ఒకే ఒక మొదటి, చివరి మంచి ఆడది శాంతి. ఇప్పుడు తను ఎక్కడుందో తెలియదు అని ముగించాడు రమణ.

**నాకు శాంతి నిజాయితీ నచ్చింది. పురుషుడి మనస్థితిని అర్థం చేసుకుని దానికి అనుగుణంగా స్వచ్ఛంగా మెలిగే ఆడవాళ్లు ఎందరుంటారు చెప్పండి. నాకు తెలిసిన ఒకే ఒక మొదటి, చివరి మంచి ఆడది శాంతి. ఇప్పుడు తను ఎక్కడుందో తెలియదు.**

అతని కళ్ళలో వల్చటి నీటిపొర స్పష్టంగా కనపడుతోంది. మేమది గమనించామని తెలుసుకుని సోడాతో మొహం కడుక్కుని అదే సోడా గడగడా తాగేసి "నా కథ తెలుగు సినిమా లాగా పెళ్ళితోనో, పమ్మీ కథల్లోలాగా పడుకోవడంతోనో ఎండ్ కాలేదని బాధగా ఉంది కదూ" అంటూ గలగలా నవ్వేశాడు తన సహజమైన మూడ్‌లోకి వస్తూ.

అందరూ ఏదో కన్ఫ్యూజన్‌లోనే ఉన్నారని గమనించి "అదేంకాదులే అందరికీ డ్రింక్ ఎక్కువైనట్టుంది" అంటూ ముగించేశాడు రమణ.